ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్‌గా డా. చిరంజీవి

కాచిగూడ: హైదారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్‌గా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.ప్రసాదరావు, కళాశాల లెక్చరర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట: డివిజన్ సమస్యల పరిష్కారానికి తన వంతు చొరవ తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నందనవనం కాలనీలో వీధి లైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను స్థానికుల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య, అంతర్గత రోడ్లు, వీధిలైట్లు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కాచిగూడ: భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కేలండర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ, కో–ఆపరేటివ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, యూనియన్ జనరల్ సెక్రటరీ ముజీబ్ హుస్సేన్, భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు జి.రాజేశ్వర్ రావు, డైరెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ సభ్యుడు సాయిబాబాకు అభినందనలు

కాచిగూడ: సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా కాలవు రెడ్డి సాయిబాబా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆయనను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య పాల్గొన్నారు.

కేసరి నర్సింగ్‌రావుకు సన్మానం

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావు యాదవ్‌ను భారత ప్రభుత్వ కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ హైదరాబాద్ టెలిఫోన్ సలహా కమిటీ సభ్యుడిగా నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం బీజేపీ నేత డా. ఎస్.గౌతంరావు గోల్నాకలో ఆయనను సత్కరించి అభినందననలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ గౌడ్, శ్రీధర్‌గౌడ్, ఆర్‌వీఎల్ రమేష్, కర్రీ రవీందర్, ఎం.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కేరళ గవర్నర్‌కు సత్కారం



అంబర్‌పేట: కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను డీడీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. బాగ్‌అంబర్‌పేట డీడీకాలనీలో నివసిస్తున్న ఆయన సన్నిహితుడు, న్యాయవాది జీకే దేశ్‌పాండే నివాసానికి వచ్చిన కేరళ గవర్నర్‌కు కాలనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రనిధులు గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ పుట్టా పాండురంగయ్య, కరణ్‌రెడ్డి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ రాజకీయ యుద్ధభేరి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వరంగల్ ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు జరగబోయే బీసీ రాజకీయ యుద్ధబేరికి కదిలిరావాలని తీన్మార్ మల్లన్న ఉప్పల్ నియోజకవర్గం టీమ్ లీడర్ భయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు పెద్ద సంఖ్యలో కదలిరావాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (65) ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జేసీబీతో అక్రమ షెడ్లు, బండ్లను తొలగిస్తున్న సిబ్బంది



ఆక్రమణల తొలగింపుతో విశాలంగా కనిపిస్తున్న శంకరమఠం మార్కెట్ రోడ్డు

రోడ్డు ఆక్రమణలపై కొరడా

- శంకరమఠ మార్కెట్‌లో తోపుడు బండ్లు, షెడ్ల తొలగింపు
- తెగిపడిన విద్యుత్ వైరు, తప్పిన ప్రమాదం
- భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు

నల్లకుంట: ఎట్టకేలకు నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులో ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్‌–16 అధికారులు కొరడా ఝులిపించారు. స్థానికుల ఫిర్యాదుతో సర్కిల్‌–16 డీసీ మారుతీదివాకర్ ఆక్రమణ తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ముందస్తుగా నల్లకుంట పోలీసుల సమన్వయంతో పూర్తి బందోబస్తు నడుమ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగించారు. శుక్రవారం మధ్యాహ్నం అక్కడికి చేరుకున్న అధికారులు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు, షెడ్లను స్వచ్ఛందంగా తొలగింపచేసుకోవాలని చెప్పిన అధికారులు అక్కడి వ్యాపారులకు ఓ గంట సమయం ఇచ్చారు. తోపుడు బండ్లను తొలగించిన వ్యాపారులు, షెడ్లను తొలగించడంలో చోద్యం చూశారు. గంటన్నర తర్వాత పూర్తి పోలీసు బందోబస్తు నడుమ జీహెచ్‌ఎంసీ అధికారులు జేసీబీ సహాయంతో షెడ్లను కూల్చి వేయించారు.

గతంలో ఓ ట్రైనీ ఐఏఎస్‌తో దురుసుగా ప్రవర్తించిన వ్యాపారి..

◆ గతంలో ఓ ట్రైనీ ఐఏఎస్ అధికారి పని నిమిత్తం శంకరమఠం రోడ్డు గుండా వెళ్లారు. ఆ సమయంలో వాహనాలు పోకుండా రోడ్డుపై అడ్డంగా ఏర్పాటు చేసిన బండ్లను పక్కకు జరపాలని అక్కడి వ్యాపారిని ఆ ట్రైనీ ఐఏఎస్ కోరారు. అందుకు ఆ వ్యాపారి 'ఇది మార్కెట్ అని తెలియదా నీకు.. నువ్వే వేరే దారిలో వెళ్లు..'అంటూ దురుసుగా సమాధానం ఇచ్చాడని స్థానికులు పేర్కొన్నారు.

తెగి పడిన విద్యుత్ వైరు..

◆ ఇక్కడి వ్యాపారులు కొందరు విద్యుత్ వైర్లకు ఆనుకుని షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేయలేదు. ఈ క్రమంలో మార్కెట్‌లోని నారాయణ కళాశాల వద్ద విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ వైర్ల నుంచి మంటలు, పొగలు వచ్చాయి. విద్యుత్ వైరు ఒక్కసారిగా తెగిపడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అటు వైపు ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ తర్వాత పోలీసుల సూచనలతో జీహెచ్‌ఎంసీ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఎట్టకేలకు దశాబ్దాల తర్వాత మార్కెట్ రోడ్డులో ఆక్రమణల తొలగింపుతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ వైర్ల నుంచి పొగలు వస్తున్న దృశ్యం, (ఇన్‌సెర్ట్‌లో).. తెగి పడిన విద్యుత్ వైరు

తిరిగి ఆక్రమణలు వెలిస్తే కేసులు నమోదు

స్థానికుల ఫిర్యాదులు, కోర్టు ఆదేశాలతో శంకరమఠం మార్కెట్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాం. తిరిగి ఎవరైనా ఇక్కడ రోడ్డు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాంటి వారిపై కేసులు కూడా నమోదు చేస్తాం. సర్కిల్‌–16 పరిధిలో ఎక్కడ ఎలాంటి అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలు చేపట్టినా ఉపేక్షించేది లేదు. – మారుతీదివాకర్, సర్కిల్‌–16 డీసీ

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం స్పందించాలి

కాచిగూడ: దేశ జనాభా లెక్కల్లో కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కుల గణన జరిపించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓబీసీ జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ రిజర్వేషన్లను వర్గీకరించడానికి కమిషన్‌ను నియమించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వెంటనే స్పందించాలన్నారు.

రాష్ట్రపతిపై సోనియాగాంధీ వ్యాఖ్యలు సరికాదు

నల్లకుంట: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ 'ఓల్డ్ పూర్ లేడీ' అని సంబోధించడంపై సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. బ్రిటీష్ కాలం నాటి మైండ్‌సెట్ నుంచి కాంగ్రెస్ బయటకు రాలేదని విమర్శించారు. దేశ తొలి ఆదివాసీ రాష్ట్రపతి పట్ల ఆమె ఇలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

మారిన పరిస్థితుల అనుగుణంగా ఉన్నత విద్యా సిలబస్‌ను

ముషీరాబాద్: మారిన పరిస్థితులు, విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నత విద్యా సిలబస్‌ను మార్చాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ విషయంలో ఉన్నత విద్యామండలి తరపున ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రిటైర్డ్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్, డైరీని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా కళాశాల ఆడిటోరియంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటరెడ్డి, ఎ.పుల్లయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమంలో డి.ధర్మేందర్, కె.ఐలయ్య, రమణయ్య, నాగేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణామూర్తి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న దండి వెంకట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బహుజన రాజ్యాధికారమే సకల జనుల సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఎల్పీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బి.కృష్ణస్వామి 4వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని ధ్వంసం చేసి చరిత్రను వక్రీకరించి తెలంగాణలో అధికారంలోకి రావడానికి బీజేపీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. విద్వేశ పూరితమైన మతోన్మాద రాజకీయాలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మార్క్సిజమ్, అంబేడ్కరిజం ఆలోచన విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఆదిపత్య కులాల కనుసన్నల్లో ఏర్పడే ప్రభుత్వాలతో బలహీన వర్గాలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో నూటికి 97శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికారంలోకి రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, మనుదర్మ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కె.పర్వతాలు, వివిద పార్టీల నాయకులు మాల్యాద్రి, నూనె వెంకటస్వామి, సిద్దిరాములు, సబ్బని లత, శ్రీశైలం, మారోజు సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని జగదాంబ నర్సింగ్ హోమ్ దగ్గర రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ గీత, ఏఈ సలాంతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, గాంధీనగర్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ నేతలు నరసింహ, ఉమేష్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, సాయి, భారత్, ప్రశాంత్, సత్తి, నీరజ్, రాణి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలి

చిక్కడపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు ద్వారా మాత్రమే ప్రభుత్వం అమలు చేయాలని భవన నిర్మాణ రంగాల కార్మికుల సంఘం అధ్యక్షుడు దరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. కార్మికులు సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వెల్ఫేర్ బోర్డుకి తమ భవన నిర్మాణ కార్మికుడినే చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.రంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాములు, గిన్నారావు, మహేందర్, కాశేబు, గంగాధర్, దశరథం, కొమురయ్య, అవాలు ఎల్లయ్య, నల్లస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టులు పెడుతున్నారని అన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని కాంగ్రెస్ వెంటే ఉన్నారని పేర్కొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉండాలి

ముషీరాబాద్: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అన్నారు. విద్యానగర్‌లోని అక్షర స్పెషల్ స్కూల్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆదర్శనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సలహాదారు కె.సుబ్బారావు, బ్యాంకు మార్కెటింగ్ మేనేజర్ వేణు, సాంబశివరావు, సంస్థ అధ్యక్షురరాలు రమాదేవి పాల్గొని సుమారు 30 మంది దివ్యాంగుల పిల్లలకు పరికరాలు పంపిణీ చేశారు. దివ్యాంగులకు దక్కవలసిన డబుల్ బెడ్‌రూమ్‌లు, లోన్లు తదితర పథకాలను ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బాగులు, దుప్పట్లు అందజేస్తున్న కొల్లి నాగేశ్వరరావు

సంఘం కార్యకలాపాలకు స్థలం కేటాయించాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం ఖాళీ స్థలాన్ని లేదా ప్రభుత్వ బిల్డింగ్‌ను కేటాయించాలని సంఘం అధ్యక్షుడు టి.రంగారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో సంఘం 13వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రిటైర్ అయినప్పటికి తమ సంఘం ఆధ్వర్యంలో రైతులను చైతన్యవంతం చేయడంతో పాటు ఏవో తదితర అధికారులకు ట్రెనింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతు కమిషన్‌కి కూడా తమ సంఘం తరుపున సలహాలు సూచనలు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా వారిలో మానసిక ధైర్యాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

జేఈఈటీసాట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడగింపు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫిబ్రవరిలో జరగే జేఈఈటీసాట్‌- 2025 పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అరుణ్ కుమార్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు ఇతర ప్రవేశ పరీక్షలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా వంద మంది విద్యార్థులకు ఉచితంగా అత్యుత్తమ ఐఐటీ, నీట్ కోచింగ్‌తో పాటు నెలకు రూ.500 స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 20 వరకు పొడిగించినట్లు తెలిపారు.

గౌడ వృత్తిదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న గౌడ జన హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలోని గౌడ వృత్తిదారుల అందరికి గుర్తింపుకార్డులు ఇవ్వాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సమితి ప్రతినిధులతో కలిసి ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కేటీకే శాస్త్రికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో 2.25లక్షల మంది గౌడ వృత్తిదారులు ఉన్నారని కమిషనర్‌కు తెలిపారు. ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం పొందిన కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న రూ8కోట్ల ఎక్స్‌గ్రేషియోను విడుదల చేయాలని కోరారు. నూతన గ్రామ పంచాయితీలలో కొత్త సొసైటీలను ఏర్పాటు చేయాలని, పోలీసుల వేధింపులు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తిదారులకు సేఫ్టీ కిట్‌లను పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గౌడలకు వర్తింపజేయాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో చంద్రం దుర్గాగౌడ్, కొనపురం ఆంజనేయులు, బిక్కు బుచ్చయ్యగౌడ్, సోమన్న, అశోక్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మందులు వాడితే కుష్ఠును నివారించొచ్చు



కుష్ఠు నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డా. వెంకటి, డా. మనోజ్‌రెడ్డి



సంజయ్‌గాంధీ నగర్ బస్తీలో కుష్ఠుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముషీరాబాద్: కుష్ఠు రోగులు సామాజిక జీవితం గడపవచ్చని జిల్లా వైద్యశాఖాధికారి డా.వెంకటి అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠు నివారణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైద్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు చర్మ, నరాలకు బ్యాక్టీరియా ద్వారా సోకుతుందన్నారు. ఈ వ్యాధికి వయస్సు, లింగభేదం లేదని తెలిపారు. సకాలంలో మందులు వాడితే నివారించవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ వ్యాధికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, పీహెచ్ఎన్‌లు కలమ్మ, పెల్లిస్, ఏఎన్ఎం విజయ్‌కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంజయ్‌గాంధీనగర్ బస్తీలో అవగాహన..

కాచిగూడ: గోల్నాక డివిజన్ సంజయ్‌గాంధీనగర్ బస్తీలో కుష్ఠుపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కుష్ఠు రహిత సమాజాన్ని సాధించే దిశగా ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీపీఎంఒ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సునిల్‌రెడ్డి, సూపర్‌వైజర్ జయంతి, ఎఎన్ఎం బి.సుహాసిని, ఆశావర్కర్ ఎన్.మాధవి, బస్తీ అధ్యక్షుడు ఎస్.యాదగిరి, యు.పవన్, సిహెచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ల ఏర్పాటుతో ప్రమాదాలకు చెక్

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- రూ.44.5 లక్షలతో సెంట్రల్ మెరీడియన్ పనులకు శంకుస్థాపన
- ముంపు సమస్య పరిష్కారంపై అధికారులతో ఎమ్మెల్యే సమాలోచనలు



ఫీవర్ సిగ్నల్స్ వద్ద సెంట్రల్ మెరీడియన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని ట్రాఫిక్ అధికండా ఉండే ప్రాంతాలో సెంట్రల్ మెరీడియన్ (దీర్ఘ చతురస్రాకారంలో రోడ్డు డివైడర్లు) ఏర్పాటు చేయిస్తాన్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సెంట్రల్ మెరీడియన్ ఏర్పాటుతో ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డు డివైడర్స్ దాటేందకు అవకాశం ఉండదన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడకుండా అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. శుక్రవారం ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి రత్నానగర్ మెయిన్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వరకు సుమారు రూ.44.5 లక్షలతో సెంట్రల్ మెరీడియన్ నిర్మాణ పనులను చేట్టనున్నారు. ఈ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిలక్ నగర్ చౌరస్తా నుంచి శంకరమఠం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వైపు వెళ్లే వాహనదారులు రత్నానగర్ వద్ద యూటర్న్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. కొందరు ద్విచక్ర వాహనదారులు యూటర్న్ వరకు వెళ్లకుండా మధ్యలో ఎత్తు తక్కువగా ఉన్న డివైడర్లపై నుంచి రోడ్డు దాటుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన తాను సెంట్రల్ మెరీడియన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. గతంలో అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి అలీ కేఫ్ వైపు ఇదే సమస్య ఉండేదన్నారు. సెంట్రల్ మెరీడియన్ ఏర్పాటు చేయించిన తర్వాత అక్కడ ప్రమాదాలు తగ్గాయని తెలిపారు.

పాదయాత్రలో ఎమ్మెల్యేకు సమస్యల ఏకరవు..

◆ అంతకు ముందు స్థానికుల విజ్ఞప్తి మేరకు అజామాబాద్ డివిజన్ విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఫీవర్ చౌరస్తా నుంచి నల్లకుంట పాత రామాలయం వరకు ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. నాగమయ్యకుంట నుంచి వచ్చే వరద నీటితో పాటు కొట్టుకొచ్చే వ్యర్థాలు పాత రామాలయం వీధి గుండా నిర్మించిన అండర్ గ్రౌండ్ రెయిన్ వాటర్ బాక్స్ నాలాలో తట్టుకుంటుందని అన్నారు. దీంతో వరద నీరు పైకి ఉబికి వచ్చి ఇక్కడి వీధులు జలమయం అవుతున్నాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.